మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

5.2.2026
గురువారం Thursday
సంపుటి (Volume): 10
సంచిక (Issue) : 287
పేజీలు : 8
Pages : 8
వెల : 2
Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## వయసు కేవలం సంఖ్య మాత్రమే
ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలి



7



# మున్సిపల్ ఎన్నికల తరవాత
# రైతుభరోసా
## రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి
### సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి
### తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్
### తెలంగాణ తల్లి మన సోనియమ్మ
### మిర్యాలగూడ ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి

"భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.

**జనతా న్యూస్, మిర్యాలగూడ :** రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ' సభలో

మిగతా 2 లో



# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం
## ఎస్సీఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు



### నిజాం నిరంకుశంపై అంకుశం దింపిన గడ్డ
### ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం
### మహబూబ్‌నగర్ ప్రచారంలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్

వివరాలు 3 లో

తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు.

# రేవంత్‌రెడ్డి బినామీ ముఖ్యమంత్రి



### దివాళా తీసిన కంపెనీకి భారీ ప్రాజెక్టులు ఎలా ఇచ్చారు
### కేఎల్ఎస్ఆర్ కుంభకోణంపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

3



# ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

### లోక్‌సభలో విపక్ష సభ్యుల ఆందోళన
### నేటికి వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా
### నరవణె పుస్తకంపై భయపడుతున్న ప్రభుత్వం
### కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలు

వివరాలు 3 లో

పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లో యూరోపియన్ యూనియన్, అమెరికాతో చేసుకున్న ఒప్పందాల వివరాలను పార్లమెంటు ముందుంచాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో బుధవారం కూడా లోక్‌సభ ప్రారంభం అవ్వగానే ప్రతిపక్ష సభ్యులు ఈ ఒప్పందాలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాలతో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు.

# తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట


### సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్
### అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం
### ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం
### మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 2 లో

తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు.



# మరణశాసనం రాసిన కొరియన్ గేమ్
## ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ఆత్మహత్య
### యూపిలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల బలవన్మరణం




.. వివరాలు 3లో

# ఫోన్ బ్లాక్ చేయడంపై ఆగ్రహం
## ప్రియుడిని కిరాతకంగా చంపిన ప్రియురాలు




.. వివరాలు 3లో



# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము
### కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం

.. వివరాలు 3లో

మణిపూర్ సీఎంగా
**యమునాం ఖేమ్‌చంద్ ప్రమాణం**

# క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

**ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి**

**అవగాహన కోసం షార్ట్‌ఫిల్మ్‌లు తీస్తా**

**క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి**



**హైదరాబాద్,ఫిబ్రవరి4 :** క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు. శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్ చిట్

**పార్టీ మారిన దాఖలాలు లేవన్న స్పీకర్**

**స్పీకర్ తీర్పును స్వాగతించిన సంజయ్**

**తాను బిఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నాని వెల్లడి**



**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని, ఆయన్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే పరిగణిస్తున్నామని స్పీకర్ తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన గెజిట్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. సంజయ్‌పై అనర్హత కోరుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇక, పార్టీ ఫిరాయిపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. సంజయ్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్.. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యేకు కూడా క్లిన్ చిట్ ఇచ్చేశారు స్పీకర్. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే స్పందిస్తూ... ' నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే. బీఆర్ఎస్ పార్టీలోనే గెలిచా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చా. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ బిల్లులు ప్రవేశపెట్టి, విప్ జారీ చేస్తే నేను మద్దతు ఇస్తా. నేనెప్పుడూ బీఆర్ఎస్ పార్టీని, అధిష్టానాన్ని విమర్శించలేదు. స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం నాకు దూరంగా ఉంది. నాది ఎలక్షన్ కోసం కాదు.. అభివృద్ధి కోసం ఆరాటం. జగిత్యాల అభివృద్ధి కోసం సీఎం, ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా' అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. నా జీతం నుంచి నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ పార్టీకి కట్ అవుతున్నాయి. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చానని సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యానించారు. కడియం నీతులు చెప్పడం ఆపు. నువ్వు కాంగ్రెస్‌లో చేరావని స్పీకర్ ముందు అంగీకరించు. ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాలయాపన చేసి అనర్హత నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఆధారాలు లేవని ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు' అని వివేకానంద తెలిపారు.

# సంజయ్ ఇకనైనా బుద్ధిగా ఉండు

**కాంగ్రెస్ రాజకీయాలను వదులుకో.. ఎమ్మెల్యేకు జీవన్ రెడ్డి చురకలు**

**జగిత్యాల,ఫిబ్రవరి 4 :** స్పీకర్ తీర్పుతో అయినా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఇక కాంగ్రెస్ జోలికి రాకుంటే మంచిదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం నాడు జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై శాసనసభ స్పీకర్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నా అని సంజయ్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నా. సంజయ్ నీకు దొంగ బుద్ధి ఎందుకు?. స్పీకర్ తీర్పుతో పద్ధతిగా ఉండు. నా కాంగ్రెస్ పార్టీలో చిచ్చుపెట్టకు. నీ బీఆర్ఎస్ పార్టీలో నువ్వు కరెక్ట్‌గా ఉండు. నా పార్టీ అంతర్గత విషయాల్లో ఎందుకు వేలు పెడుతున్నావు?. అభివృద్ధి అంటే పక్కింట్లోకి కన్ను వేయడమా?. గడిచిన రెండు ఏళ్లలో సీఎం రేవంత్‌తో ఉండి నువ్వు చేసిన అభివృద్ధి ఏంటీ చెప్పు.. సంజయ్?' అని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు ఏడాదిన్నర కాలంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనూ ఘాటుగా విమర్శించారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించినట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# విద్యుత్ కనెక్షన్లకు కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** తెలంగాణలో విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో గురువారం నుంచి భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇందుకోసం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో స్తంభాలు, లైన్స్ కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో రీతిలో ఫీజు వసూలు చేసేవారు. ఇకపై ఫిక్స్‌డ్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. గృహ విద్యుత్ కనెక్షన్‌లకు 1 కిలో వాట్ వరకు రూ.500. ఒకటి నుంచి 5కేవీ వరకు రూ.500? కిలో వాట్‌కి రూ.600 చొప్పున వసూలు చేయనున్నారు.

# మున్సిపల్ ఎన్నికల తరవాత రైతుభరోసా

మొదటి పేజీ తరువాయి



సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్దిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో ఃూఒఃఅ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఃూఒఃఅ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్లు సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రెండేళ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ, 'కాంగ్రెస్ గెలిస్తే పేదవారు గెలుస్తారు' అని సీఎం అన్నారు.





# తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

**సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్**

**అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం**

**ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం**

**మీడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ పక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

**ఖమ్మం,ఫిబ్రవరి 4 :** తెలంగాణ లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇప్పటికే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, రెండో జాబితా పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. త్వరలో రెండో విడత లబ్దిదారుల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ఈ విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఃరాజకీయాలను పక్కనపెట్టి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. మొత్తం 4 విడతల్లో లబ్దిదారుల ఖాతాల్లో ఆ మొత్తం నిధులు జమ చేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో పేదలు ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. మరికొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి.

## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

### తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని

### టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు‘ అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కల్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారుని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతానికిపైగా మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఆ భయంతో పవన్ కల్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. ఆంధ్రాలో రాజకీయాలు చేసుకుంటే మంచిదని పీసీసీ చీఫ్ సూచించారు.

## స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

### కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కెటిఆర్ ఆగ్రహం

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

## తెలంగాణ కోసం ఏనాడైనా రేవంత్ పోరాడారా

### మాజీమంత్రి హరీష్ రావు ప్రశ్న

**మెదక్,ఫిబ్రవరి 4 :** తెలంగాణ కోసం తాము మంత్రి పదవులు త్యాగం చేశామని.. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా రాష్ట్రం కోసం పోరాడారా? అని భారత రాష్ట్రసమితి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని మెదక్ ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ధ్వజమెత్తారు. ‘మెదక్ నుంచి సిద్దిపేటకు ఆఫీసులను నేను తరలించానని అంటున్నారు. నేను తరలించిన ఆఫీస్ పేరు చెబితే నేనే తెచ్చిస్తా. రేవంత్‌రెడ్డి ఒక్కటంటే.. నేను రెండంటాను. ఆయన మంచి మాట్లాడితే.. మేము మంచే మాట్లాడతాం. ఆయన భాష జారితే.. మేము కూడా జారాల్సి వస్తుంది. రైతు భరోసా సొమ్ము ఈనెల 11లోపు ఇవ్వకపోతే కర్షక ఆగ్రహానికి గురికాక తప్పదు‘ అని హరీశ్‌రావు అన్నారు.

# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

### ఎస్సీఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు

### నిజాం నిరంకుశంపై అంకుశం దింపిన గడ్డ

### ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం రేవంత్

### మహబూబ్‌నగర్ ప్రచారంలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్



**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 4 :** తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.

ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు.

నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమిషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో రైల్వేకు రూ.5,400 కోట్లకుపైగా కేటాయించింది. తెలంగాణకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించింది. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోంది. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తోంది. కొన్నివర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోంది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపట్లేదు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం‘ అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

కేసీఆర్, రాహుల్ గాంధీ మధ్య ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి ఆరోపించారు. అందుకే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అందరి ఫోన్లు ట్యాపింగ్ చేసి పౌరహక్కులు కాలరాసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. బీజేపీ కార్యాలయంలో క్లర్క్ ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారంటూ విమర్శించారు. సిట్ నోటీసులు టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయ దురహంకారం పెరిగిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. బీజేపీని చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గెలిస్తే మాత్రం ట్యాక్స్‌లు పెరుగుతాయని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే మాత్రం.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి తీరాలని కేడర్‌కు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి.. బీజేపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

### ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి బండి సంజయ్

### పోలీసులు నిష్పక్షపాతంగా ఉండాలని హితవు



**వేములవాడ,ఫిబ్రవరి 4 :** వేములవాడ మున్సిపాలిటీని భాజపా కైవసం చేసుకోవడం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిధులిచ్చేది మోదీ... తెచ్చేది నేను. మరి కాంగ్రెస్, భారాసకు ఎందుకు ఓట్లేయాలి?కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల, వేములవాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ పాల్గొన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారా? నిరుద్యోగ భృతి ఇచ్చారా? పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. కేంద్రం నిధులిస్తే కమిషన్లు దండుకున్నారు. మళ్లీ దొంగ హామీలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. ఎందుకు ఓటేయాలంటూ ఆ రెండు పార్టీలను నిలదీయండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే భాజపా కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడతారా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటా.. మీ డీజీపీ, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుంది అంటూ.. సిరిసిల్ల పోలీసులను కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. మా రిక్వెస్ట్‌ను చేతగానితనంగా భావిస్తున్నారా? ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా అని అన్నారు. సిరిసిల్ల సీఐ క్రిష్ణ.. భాజపా నాయకులు, సిబ్బందిపై దాడి చేసి ఓవరాక్షన్ చేశారని బండి సంజయ్ మండిపడ్డారు. తక్షణమే విధుల్లోంచి తప్పించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

## రేవంత్‌రెడ్డి బినామీ ముఖ్యమంత్రి

### దివాళా తీసిన కంపెనీకి భారీ ప్రాజెక్టులు ఎలా ఇచ్చారు

### కేఎల్ఎస్ఆర్ కుంభకోణంపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ స్కాములను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నామని, మూసీ నది పేరిట లక్షల కోట్ల దోపిడీని బీఆర్ఎస్ అడ్డుకుందని అన్నారు. లగచర్లలో అల్లుడి కంపెనీ కోసం గిరిజనుల భూములు లాక్కోవాలని చూస్తే బీఆర్ఎస్ అడ్డుకుందని, హిల్ట్ పాలసీలో లక్షల కోట్ల కుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిందని చెప్పారు. అలాగే, సింగరేణి అవినీతినీ తమ పార్టీ బయటపెట్టిందని కేటీఆర్ వెల్లడించారు. కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రా కంపెనీని సీఎం రేవంత్ రెడ్డి బినామీ కంపెనీగా కేటీఆర్ అభివర్ణించారు. జనవరి 23న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కేఎల్ఎస్ఆర్‌పై సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిందని, దివాళా తీసిన కంపెనీకి కాంట్రాక్టులు ఎలా ఇస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని ఆయన చెప్పారు. కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రాకు రూ.6 వేల కోట్ల టెండర్లు ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి బినామీ చీఫ్ మినిస్టర్ అని, ఆయన్ను వెనుక నుంచి వేరే వాళ్లు నడిపిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేఎల్ఎస్ఆర్‌కు అప్పగించారని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డిపై గతంలో రైడ్స్ జరిగితే




అందులో కేఎల్ఎస్ఆర్ కంపెనీ రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ అని ఐటీ శాఖ అనుమానం వ్యక్తం చేసిందన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీలో రేవంత్ రెడ్డి బినామీ పెట్టుబడులు ఉన్నాయని 2018లోనే ఐటీ చెప్పిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సీఎం కాగానే కేఎల్ఎస్ఆర్‌కు రెక్కలు వచ్చాయన్నారు కేటీఆర్. మెదక్‌లో ఆర్ అండ్ బి వర్క్స్, షాద్‌నగర్ పరిగి రోడ్, ఇరిగేషన్ వర్క్స్ ఇచ్చారని కేటీఆర్ అన్నారు. 2023 జులై నుంచి కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాళా తీసిందని ఆయన చెప్పారు. బినామీ బాగోతం బయటకు రాకుండా ఉండటం కోసం దావోస్ నుంచి బాగోతం నడిపారని మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థకు ఇచ్చిన కాంట్రాక్టులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దావోస్‌లో సీఎం మాయమయ్యారనే వార్తలు వచ్చాయన్నారు. బినామీ బాగోతాలు చక్కబెట్టుకోవడం కోసమే ముఖ్యమంత్రి మాయమయ్యారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ నుంచి రేవంత్ రెడ్డి కుటుంబీకులకు చెందిన కంపెనీలకు డబ్బులు బదిలీ అయ్యాయని కేటీఆర్ ఆరోపించారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఃపార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సంబంధించిన తీర్పు కామెడీ సీరియల్ అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గాంధారి ప్రసాద్ కుమార్‌గా మారారని ఆయన విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు స్వయంగా సీఎం కండువా కప్పారని తెలిపారు. దీనిపై కోర్టులోనే తేల్చుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మరణశాసనం రాసిన కొరియన్ గేమ్

**ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ఆత్మహత్య**

**యూపిలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల బలవన్మరణం**




**లక్నో:** ఉత్తర ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రాణం తీసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించటంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అన్ని పనులు కలిసే చేసేవారు. కోవిడ్ సమయంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. గంటలు, గంటలు గేమ్ ఆడుతూ గడిపేవారు. అంతేకాదు.. తమ పేర్లు మార్చుకుని కొరియన్ పేర్లు పెట్టుకున్నారు. గేమ్ అడిక్షన్ కారణంగా స్కూలుకు కూడా సరిగా వెళ్లేవారు కాదు. పిల్లలు పూర్తిగా గేమ్‌కు బానిసలుగా మారటంతో తల్లిదండ్రులకు కోపం వచ్చింది. వారిని ఇకపై గేమ్ ఆడవద్దని మందలించారు. దీంతో ముగ్గురూ మనస్తాపానికి గురయ్యారు. గేమ్ ఆడకుండా బతకలేమని భావించారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురూ కలిసి చనిపోవాలని నిశ్చయించుకున్నారు. మంగళవారం 8 పేజీల సూసైడ్ నోట్ రాశారు. రాత్రి 2.30 గంటల ప్రాంతంలో 9వ అంతస్తులో ఉన్న తమ ఎ÷-లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. బిల్డింగ్ దగ్గర పెద్ద శబ్దం రావటంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న వారిని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మాస్ సూసైడ్స్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కాచె÷-లలెళ్ల గదిలోకి వెళ్లి పరిశీలించగా అక్కడ సూసైడ్ నోట్ దొరికింది. ఆ సూసైడ్ నోట్‌లో వారు తమ బాధనంతా వివరంగా రాసుకొచ్చారు. తల్లిదండ్రులకు క్షమాపణ సైతం చెప్పారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఏం తేలిదంటే.. ప్రాచీ విపరీతంగా మొబైల్ ఫోన్ వాడేది. ఆమె కారణంగానే మిగిలిన ఇద్దరూ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. చివరకు గేమ్ అడిక్షన్ కారణంగానే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

## ఫోన్ బ్లాక్ చేయడంపై ఆగ్రహం

**ప్రియుడిని కిరాతకంగా చంపిన ప్రియురాలు**

**రాయపూర్:** ప్రియుడు తన ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడిని అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేసింది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బిలాస్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల కమ్తా ప్రసాద్ సూర్య వంశీ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి హోటల్‌కు దగ్గరలో ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అతడికి ఇన్‌స్టాగ్రామ్‌లో 22 ఏళ్ల రోషిణి సూర్యవంశీతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కలిసి తిరిగే వారు.. ఫోన్‌లో గంటలు, గంటలు మాట్లాడుకునే వారు. అయితే, గత మూడు రోజుల నుంచి ప్రసాద్ వింతగా ప్రవర్తించటం మొదలెట్టాడు. రోషిణి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో రోషిణి తీవ్ర ఆగ్రహానికి గురైంది. అతడు వేరే అమ్మాయితో తిరుగుతున్నాడేమోనన్న అనుమానం వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం కత్తి తీసుకుని ప్రసాద్ ఉండే ఇంటి దగ్గరకు వెళ్లింది. ప్రసాద్ తలుపు తెరవగానే అతడి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడు ఇందుకు ఒప్పుకోలేదు. ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. కట్టలు తెంచుకున్న కోపంతో రోషిణి ప్రసాద్‌పై కత్తితో దాడి చేసింది. నేరుగా అతడి గుండెపై పొడిచింది. ప్రసాద్ గట్టిగా అరవటంతో లోపల ఉన్న ఫ్రెండ్ బయటకు వచ్చాడు. ప్రసాద్ నేలపై రక్తపు మడుగులో పడిపోయి ఉన్నాడు. ఆ ఫ్రెండ్ వెంటనే ప్రసాద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.నిందితురాలు రోషిణిని అరెస్ట్ చేశారు. పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'ఆ యువతి మృతుడి ఇంటికి వచ్చింది. అతడి ఫోన్ ఇవ్వమని డిమాండ్ చేసింది. గొడవ సందర్భంగా కత్తితో అతడి గుండెపై పొడిచింది. అతడు అక్కడికక్కడే చనిపోయాడు' అని తెలిపారు. కాగా, బీజేపీ నాయకుడు, జిల్లా పంచాయత్ ప్రెసిడెంట్ రాజేష్ సూర్యవంశీకి ప్రసాద్ మేనల్లుడని తెలుస్తోంది.

## నేరస్థులను నడిపించుకుంటూ స్టేషన్‌కు

**హత్యకేసులో నిందితులకు వినూతన్న శిక్ష**

**బాపట్ల :** యువతలో నేర ప్రవృత్తి బాగా పెరుగుతోంది. దీనిని కట్టడి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. నేరానికి పాల్పడిన నిందితులను కిలోమీటర్ల మేర పట్టపగలు నడి రోడ్డుపై నడిపించి.. పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్తున్నారు. ఈ తరహా ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల చీరాలలో యువకుడి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు పాల్పడిన నిందితులకు పోలీసులు ఈ తరహా పద్ధతినే అమలు చేశారు. నేరాలకు పాల్పడే వారికి ఈ తరహా చర్యలు తప్పవంటూ నేర ప్రవృత్తి ఉన్నవారికి చెప్పకనే చెప్పారు పోలీసులు.

జనవరి 27న చీరాల ఫ్లై ఓవర్ వద్ద కొండే త్రినాథ్ (19) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అతడిని బీరు బాటిల్స్‌తో దారుణంగా పొడిచి.. బండరాయితో తలపై మోది హత్య చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా చీరాల ప్రాంతాల్లోని పలు సీసీ కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో వారిని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఓ యవతితో ప్రేమ వ్యవహారంలో త్రినాథ్‌ను షేక్ గౌస్ హత్య చేశాడు. అతడికి దేవ హర్ష, శీలం భగవంతుడు సహాయం చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన కొండె వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతులకు రెండో కుమారుడు త్రినాథ్ (19). అతడు తన అన్నతో కలిసి చీరాలలోని నానామ్మ ఇంటి వద్ద ఉంటూ.. రోజు వారీ విద్యుత్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. త్రినాథ్, ఓ యువతి ప్రేమించుకుంటున్నారు. ఆ యువతిని త్రినాథ్ స్నేహితుడు షేక్ గౌస్ సైతం ప్రేమిస్తున్నాడు. దాంతో త్రినాథ్‌పై షేక్ గౌస్ కక్ష పెంచుకున్నాడు. దాంతో స్నేహితుల సహాయంతో త్రినాథ్‌ను గౌస్ దారుణంగా హత్య చేశాడని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.

# ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

**లోక్‌సభలో విపక్ష సభ్యుల ఆందోళన**

**నేటికి వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా**

**నరవణె పుస్తకంపై భయపడుతున్న ప్రభుత్వం**

**కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ విమర్శలు**



**న్యూఢిల్లీ :** పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లో యూరోపియన్ యూనియన్, అమెరికాతో చేసుకున్న ఒప్పందాల వివరాలను పార్లమెంటు ముందుంచాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో బుధవారం కూడా లోక్‌సభ ప్రారంభం అవ్వగానే ప్రతిపక్ష సభ్యులు ఈ ఒప్పందాలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాలతో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. మరోవైపు రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోడీ మాట్లాడడనున్నారు. ఇకపోతే భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె పుస్తకంలోని ఓ అంశంపై వివాదం కొనసాగుతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఆ పుస్తకం చదివితే చైనా మన సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు మన దేశ నాయకత్వం దానిపై ఎలా స్పందించిందనే విషయం బయటపడిపోతుందని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ విషయంపై పార్లమెంటులో మాట్లాడనీయ కుండా చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా నాయకులు మాట్లాడేటప్పుడు కూడా పుస్తకాలు, పత్రికల గురించి ప్రస్తావిస్తార న్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవి. కానీ, ఇప్పుడు ఓ వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే ముందుకు తీసుకొస్తున్నారని విమర్శలు చేశారు. వారికి సంబంధించి ఏ విషయాలు బయటపడతాయోనని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే ఆ పుస్తకం ప్రచురణకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇంకా ప్రచురణ కాని నరవణె రాసిన పుస్తకాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని తాను అనుకోవడం లేదన్నారు. ఒకవేళ మోదీ వస్తే.. తానే స్వయంగా ఆయన వద్దకువెళ్లి ఈ పుస్తకాన్ని అందజేస్తానన్నారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము**

**కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం**

**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్ధవంతంగా నిర్వహించారు.




## మణిపూర్ సీఎంగా యమునాం ఖేమ్‌చంద్ ప్రమాణం

**ఇంఫాల్ :** మణిపూర్ ముఖ్యమంత్రిగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం నాడు రాజధాని ఇంఫాల్‌లోని రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్ చేత.. ఆ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ప్రమాణ స్వీకారం చేయించారు. బీజేపీ ఎమ్మెల్యే నెమ్చా కిప్‌జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ ఎమ్మెల్యే ఎల్.డిఖో డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేశారు. గతేడాది మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనను ఇవాళ(ఫిబ్రవరి 04న) ఎత్తివేస్తూ రాష్ట్రపతి ఆదేశాలు జారీ చేశారు. ఆ వెంటనే ముఖ్యమంత్రిగా యుమునాం ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఖేమ్‌చంద్ సింగ్‌ను ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఎన్నుకున్నారు. 2023లో మే మాసంలో జాతుల మధ్య ఘర్షణల కారణంగా మణిపూర్ రాష్ట్రం అట్టుడికింది. దాంతో 250 మందికి పైగా ప్రజలు మరణించారు. వేలాది మంది రాష్ట్రం విడిచి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిపోయారు. ఆ తర్వాత అంటే.. ఈ ఘర్షణలు చోటుచేసుకున్న దాదాపు తొమ్మిది నెలల అనంతరం బీరేన్ సింగ్.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దాంతో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంకోవైపు ప్రస్తుత సీఎం ఖేమ్‌చంద్ సింగ్.. 2017 నుంచి 2022 వరకు మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత బీరెన్ సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా కీలక బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలోని మైతేయిలు, కుకీలు, నాగాలతో ఖేమ్‌చంద్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. దీంతో ఆయనను ముఖ్యమంత్రిగా ఎంపిక చేయాలని బీజేపీ అగ్రనాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# తిరుమల జోలికి వస్తే వినాశనం తప్పదు

**దేవదేవుడికి అపచారం చేస్తే అంతే సంగతులు**

**వైసిపికి టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి హెచ్చరిక**

**న్యూఢిల్లీ:** వైసీపీ నాయకులపై టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల ఆరాధ్య దైవం కలియుగ వేంకటేశ్వర స్వామి, హిందువుల ఆధ్యాత్మిక రాజధాని తిరుమల క్షేత్రాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని సూచించారు. తిరుమల చుట్టూ రాజకీయాలు తిరిగితే వినాశనమే జరుగుతుందన్నారు. వైసీపీ నాయకులు తిరుమల చుట్టూ గిరిప్రదక్షిణ చేసి పుణ్యం సంపాదించుకోవాలని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. 2019 నుంచి 2024 వరకు తిరుమలలో చేసిన అపచారాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని భాను ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. వైవీ సుబ్బారెడ్డి ఢిల్లీకి వచ్చి కల్తీ నెయ్యిపై నీతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. భవిష్యత్తులో తామే అధికారంలోకి వస్తామని వైసీపీ నేతలు అనుకుంటున్నారని.. భోగి పండుగకు డ్యాన్సులు, దీపావళికి టపాసులు తప్ప జైత్రయాత్ర చేసేది లేదని వ్యంగ్యంగా విమర్శించారు. మనిషిలాగా ప్రవర్తించాలి కాని ఆంబోతులాగా కాదని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి సూచించారు. ఏపీ ప్రజలు ఇప్పటికే వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశారని, అయినా సిగ్గు లేకుండా స్వామివారితో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో నెయ్యి కాకుండా కల్తీ పదార్థాలు వాడారని సిట్ నివేదికలో స్పష్టంగా ఉందని భాను ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. కొందరు వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాక్షస పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలకు జైత్రయాత్ర అనేది లేదని, ఎన్నడూ లేని విధంగా దీపావళికి జగన్ మోహన్ రెడ్డి టపాసులు కాల్చారని విమర్శించారు. టపాసులు కాల్చుకోవడానికి వైసీపీ నేతల శేష జీవితం సరిపోతుందని ఆయన సెటైర్ వేశారు. 2019-2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల పాలు చేశారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. రాష్టాన్ని ముందుకు తీసుకుపోతుంటే జగన్ మోహన్ రెడ్డి ఓర్వలేకపోతు న్నారని అన్నారు. టా÷-గ్గ్ం÷ట్ తిరుమలగా వైసీపీ నేతలు పని చేస్తున్నట్లు విమర్శించారు. వైసీపీ దుర్మార్గులు ఇప్పుడు ఏపీ మీద పడ్డారన్నారు. పారిశ్రామికవేత్తలు రాష్టానికి వస్తున్నారని.. వైసీపీ నేతలు ఏడుస్తున్నారని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో ధృతరాష్ట్రుడి పాలన జరిగిందంటూ ఆయన వ్యాఖ్యానించారు. సిట్ నివేదికలో కోట్ల రూపాయలు హవాలా మార్గంలో చేతులు మారాయని తేలిందని భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. కల్తీ నెయ్యి వెనుక ఉన్న కుట్రదారులు, పాత్రధారులు బయటకు వస్తారని తెలిపారు. కుల రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్‌ను వేదికగా చేసుకోవద్దని సూచించారు. ఆంబోతులను రోడ్లపైకి వచ్చి.. ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఈరోజు ఇంకో నాయకుడు (జగన్) గుంటూరుకు బయలుదేరారని చెప్పారు. రోడ్డుపై ఆంబోతులు గొడవ చేస్తే వదిలేస్తామా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆందోళనలు.. జగన్ ప్రీ ప్లాన్ స్కెచ్‌గా భావిస్తున్నామని తెలిపారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే గందరగోళం చేస్తున్నారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు.

# ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారా..? అయితే ఈ ఆహారాలను తీసుకోండి..!

మన శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపించడంలో కాలేయం ముఖ్య పాత్ర పోషిస్తుంది. రక్తం నుండి విషాన్ని తొలగించడంలో, హానికరమైన పదార్థాలను విచ్చినం చేయడంలో, అనారోగ్య సమస్యలకు వాడే మందుల నుండి వచ్చే విషాలను తొలగించడంలో ఇలా అనేక రకాలుగా కాలేయం తన విధులను నిర్వర్తిస్తుంది. అలాగే పిత్తాన్ని విడుదల చేసి జీర్ణక్రియలో కూడా కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. కొవ్వులను విచ్చినం చేయడంలో, శరీరం పోషకాలను గ్రహించేలా చేయడంలో ఈ పిత్త రసం పాత్ర ఎంతో ఉంది. కానీ మారిన మన జీవన విధానం కారణంగా మనలో చాలా మంది కాలేయ సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ఫ్యాటీలివర్ సమస్యతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. కనుక కాలేయ ఆరోగ్యంపై కూడా జాగ్రత్త వహించడం చాలా అవసరం.



## గుమ్మడి గింజలు..

జీవన శైలిలో మార్పులు చేసుకోవడంతో పాటు సరైన ఆహారాలను తీసుకోవడం వల్ల మనం కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాగే మెగ్నీషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మెగ్నీషియం ఉండే ఆహారాలు ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంతో పాటు శరీర ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వారు చెబుతున్నారు. గుమ్మడి గింజలను అవకాడాతో కలిపి తీసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అవకాడో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంతో పాటు కాలేయ పనితీరుకు కూడా మద్దతును ఇస్తుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వులు కాలేయం డిటాక్సిఫికేషన్ ను మెరుగుపరచడంలో దోహదపడతాయి. ఇక గుమ్మడి గింజలల్లో ఉండే మెగ్నీషియం, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు కాలేయం వాపును తగ్గించడంలో, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

## పాలకూర, ఆలివ్ ఆయిల్..

అదే విధంగా పాలకూర, ఆలివ్ ఆయిల్ ను కలిపి తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. పాలకూరలో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది కాలేయం పనితీరును మెరుగుపరచడంతో పాటు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పాలకూరలో ఉండే నైట్రేట్స్, యాంటీ ఆక్సిడెంట్లు కాలేయ ఎంజైమ్ ల స్థాయిలను మెరుగుపరుస్తాయి. అలాగే ఆలివ్ ఆయిల్ శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల కాలేయ వాపు తగ్గుతుంది. ఇక పొట్టు మినపప్పు కూడా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మనకు ఎంతగానో సహాయపడుతుంది. దీనిలో ఫైబర్ తో పాటు పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. మినపప్పును తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండడంతో పాటు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం కూడా తగ్గుతుంది. దీనిలో ఉండే ఫ్లేవనాయిడ్స్, పాలీఫినాల్స్ ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కాలేయ వ్యాధులు రాకుండా కాపాడతాయి.

## డార్క్ చాక్లెట్..

కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో డార్క్ చాక్లెట్ కూడా మనకు ఉపయోగపడుతుంది. దీనిలో ఎపికాటెచిన్, కాటెచిన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కాలేయ వాపును తగ్గిస్తాయి. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య వచ్చే అవకాశాలు కూడా చాలా వరకు తగ్గుతాయి. సోయాబీన్స్ కూడా కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తాయి. సోయాలో జెనిస్టీన్, డైడ్జిన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తాయి. అలాగే బాదం, జీడిపప్పులో కూడా మెగ్నీషియం అధికంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. దీంతో ఫ్యాటీలివర్ సమస్య వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. వీటిని తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి కాలేయ వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. ఈ విధంగా ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ తో పాటు ఇతర కాలేయ సమస్యలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఈ ఆహారాల్లో పోషకాలు కూడా అధికంగా ఉంటాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల శరీర మొత్తం ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

# ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించాలంటే.. ఇలా చేయండి..



వయసు పైబడే కొద్దీ వృద్ధాప్యం రావడం సహజం. వృద్ధాప్యం కారణంగా శరీరంలో ఇతర అవయవాల పనితీరు తగ్గినట్టుగానే చర్మం కూడా వృద్ధాప్య లక్షణాలను చూపిస్తుంది. చర్మం ముడతలు పడడం, చర్మం వదులుగా అవ్వడం, స్థిరత్వాన్ని కోల్పోవడం వంటివి జరుగుతూనే ఉంటాయి. చాలా మంది చర్మం చూపించే ఈ వృద్ధాప్య లక్షణాలను నివారించడానికి మేకప్ వేసుకోవడంతో పాటు చర్మం బిగుతుగా అవ్వడానికి శస్త్ర చికిత్సలు వంటివి కూడా చేయించుకుంటారు. అయితే ఇవన్నీ అవసరం లేకుండా మన రోజువారీ అలవాట్ల ద్వారా కూడా చర్మాన్ని ఎక్కువ కాలం యవ్వనంగా, శక్తివంతంగా ఉండేలా చేసుకోవచ్చు. జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల చర్మాన్ని, శరీరాన్ని సహజంగా అందంగా, యవ్వనంగా మార్చుకోవచ్చు. చర్మం ఎక్కువకాలం పాటు యవ్వనంగా ఉండడానికి జీవనశైలిలో ఎటువంటి మార్పులు చేసుకోవాలో.. తెలుసుకుందాం.

## నిద్ర ఆవశ్యకత..

రోజూ తగినంత నిద్రించాలి. నిద్రించడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. దీంతో కణాల మరమ్మత్తు జరుగుతుంది. దీంతో వృద్ధాప్యం నెమ్మదిస్తుంది. కనుక రోజూ 7 నుండి 8 గంటల పాటు నిద్రించడం చాలా అవసరం. అలాగే పండ్లు, కూరగాయలు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకోవాలి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మ స్థితిస్థాపకతను, కణాల మరమ్మత్తును ప్రోత్సహిస్తాయి. దీంతో వృద్ధాప్యం త్వరగా రాకుండా ఉంటుంది. క్రమం తప్పకుండా రోజూ వ్యాయామం చేయాలి. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. శరీరం శక్తి కూడా పెరుగుతుంది. రక్తప్రసరణ పెరగడం వల్ల చర్మానికి పోషకాలు ఎక్కువగా అందుతాయి. దీంతో చర్మ ఆరోగ్యం, అందం రెండూ పెరుగుతాయి.

## ఒత్తిడిని తగ్గించుకోవాలి..

అదే విధంగా వృద్ధాప్యం త్వరగా రాకుండా ఉండాలంటే ఒత్తిడి తగ్గించుకోవాలి. యోగా, ధ్యానం వంటివి చేయడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ ఉత్పత్తి తగ్గుతుంది. ఇది చర్మానికి, శరీర ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. సూర్యుడి నుండి వచ్చే యూవీ కిరణాలు చర్మంపై నేరుగా పడడం వల్ల నల్ల మచ్చలు, ముడతలు రావడంతో పాటు దీర్ఘకాలిక చర్మ నష్టం కలుగుతుంది. కనుక చర్మంపై నేరుగా సూర్యుడి కిరణాలు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఈ విధంగా మన జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల సహజంగానే చర్మం వృద్ధాప్య ఛాయలను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. జీవన శైలిలో వచ్చే ఈ మార్పులు చర్మానికే కాకుండా మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు కలిగేలా చేస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# షుగర్ ఉన్నవారు ఈ మిల్లెట్లను తీసుకోవాలి.. ఎంతో మేలు జరుగుతుంది..!

మధుమేహ వ్యాధి గ్రస్తులు ఆహారం తీసుకునే విషయంలో ప్రతిరోజూ ఒక సవాల్ ను ఎదుర్కొంటారని చెప్పవచ్చు. ఎందుకంటే వీరు తీసుకునే ఆహారం తక్షణమే రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, అనారోగ్యానికి కూడా దారి తీస్తుంది. కనుక ఆహార విషయంలో మధుమేహ వ్యాధి గ్రస్తులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చాలా మంది చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి చపాతీలను తీసుకుంటూ ఉంటారు. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని ఇవే సరైన ఆహారం అని నమ్ముతారు. అయితే ఇవే కాకుండా మిల్లెట్స్ తో చేసిన ఆహారాలను తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. చిరుధాన్యాలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక నెమ్మదిగా జీర్ణమవుతాయి. దీంతో ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరగడంతో పాటు స్థిరమైన శక్తి విడుదల అవుతుంది.





## సామలు..

మిల్లెట్స్ అన్నీ మేలు చేసేవే అయినప్పటికీ సజ్జలు, సామలు, కొర్రలు అనే ఈ మూడు రకాల మిల్లెట్స్ మరింత మేలు చేస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. ఈ మిల్లెట్స్ లో ఫైబర్ తో పాటు పోషకాలు, యాంటీ ఆక్సీడెంట్లు కూడా ఉంటాయని వీటిని తీసుకోవడం వల్ల మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఎంతో మేలు కలుగుతుందని వారు సూచిస్తున్నారు. సామలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. రక్తంలో గ్లూకోజ్ ను నెమ్మదిగా విడుదల చేయడంలో ఇవి సహాయపడతాయి. దీంతో రక్తంలో చక్కెర పెరుగుదల నివారించబడుతుంది. వీటిలో ఉండే అధిక ఫైబర్ గ్లూకోజ్ ను నియంత్రించడంతో పాటు ఇన్సులిన్ సెన్సిటివిటీని కూడా పెంచుతుంది. సామల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మొత్తం శరీరానికి మేలు చేస్తాయి. వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుంది. మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.

## కొర్రలు..

కొర్రలు వాటి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కు, ఫైబర్ కు ప్రసిద్ధి చెందాయని చెప్పవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. వీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. కనుక కొర్రలను తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. మంచి బ్యాక్టీరియాను పెంపొందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా కొర్రలు మనకు సహాయపడతాయి.



## సజ్జలు..

సజ్జల్లో మెగ్నీషియం, ఐరన్, క్యాల్షియం వంటి ఖనిజాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో బరువు అదుపులో ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారు ఈ మూడు రకాల మిల్లెట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలు ఎల్లప్పుడూ అదుపులో ఉంటాయి. శరీర మొత్తం ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వీటితో తరచూ పాన్‌కేక్స్, కిచిడీ, పొంగల్, ఉప్మా, దోశ, ఇడ్లీ వంటి వాటిని కూడా తయారు చేసి తీసుకోవడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

# ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకం ఖమ్మం

**ప్రచారంలో ముందున్న మంత్రి పొంగులేటి**

**విభేదాలు రాకుండా జాగ్రత్త పడ్డ అమాత్యులు**



**ఖమ్మం,ఫిబ్రవరి4 :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకంగా మారాయి, డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మలలు తమ ప్రాంతాల్లో పట్టుకోసం యత్నిస్తున్నారు. మంత్రి పొంగులేటి ప్రచారం ముందున్నారు. మున్సిపల్ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థుల లెక్క తేలింది. చివరి రోజు ఆయా పార్టీలు తమ క్యాండేట్లకు బీ ఫామ్స్ అందజేయగా, టికెట్ ఆశించి భంగపడిన పలువురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మిగిలిన వారు రెబల్స్ గా మారి బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలకు ఆయా పార్టీల గుర్తులు ఇవ్వగా, ఇండిపెండెంట్లకు ఆఫీసర్స్ గుర్తులు కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇక రాజకీయాలు వేడెక్కాయి. మంత్రి పొంగులేటి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచార ఉధృతి పెంచారు. ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఒక్క చోట మాత్రమే వార్డు కౌన్సిలర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏదులాపురం 15వ వార్డులో సీపీఎం, బీజేపీ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి తమ్మినేని మంగతాయి ఒక్కరే పోటీలో నిలిచారు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం అయింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 106 డివిజన్లు, వార్డులకు 540 మంది బరిలో నిలిచారు. జిల్లాలోని మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 117 వార్డులకు 922 నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూటీ తర్వాత 787 నామినేషన్లు చెల్లుబాటు అవుతాయని గుర్తించారు. మధిరలో 22 వార్డులకు 165 దాఖలు కాగా, గడువు ముగిసేసరికి 95 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 70 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 19 , బీఆర్ఎస్ తరపున17 , సీపీఎం 3, సీపీఐ 1, జనసేన 5, బీజేపీ 19, స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు పోటీలో ఉన్నారు. కల్లూరు మున్సిపాలిటీలో 20 వార్డులకు మొత్తం 130 మంది నామినేషన్ దాఖలు చేశారు. 58 మంది ఉపసంహరణ చేసుకోగా, 72 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో బీఆర్ఎస్ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 20, బీజేపీ 16, బీఎస్పీ 3, ఇండిపెండెంట్లు 13 మంది పోటీ చేస్తున్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డుల్లో 202 నామినేషన్లు వచ్చాయి. వాటిలో 15వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం కాగా, మిగిలిన 31 వార్డుల్లో 108 మంది పోటీలో నిలిచారు. కాంగ్రెస్ తరపున 30 మంది, బీఆర్ఎస్? 23, సీపీఎం 7, బీజేపీ 24, సీపీఐ 11 వార్డుల్లో పోటీలో అభ్యర్థులను నిలిపాయి. 13 మంది ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారు. సత్తుపల్లిలో 23 వార్డుల్లో స్క్రూటీ తర్వాత 124 మంది పోటీలో నిలిచారు. వీరిలో 83 మంది బరిలో ఉండగా, 41 మంది విత్ డ్రా చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి 23, బీఆర్ఎస్ 22, బీజేపీ 22, జనసేన 4, సీపీఐ 2, సీపీఎం నుంచి ఒక్కరు, ఇండిపెండెంట్లు 9 మంది పోటీలో నిలిచారు. వైరా మున్సిపాలిటీలో 20 వార్డుల్లో మొత్తం 155 మంది నామినేషన్లు వేశారు. వీటిలో 75 మంది విత్ డ్రా చేసుకోగా, 80 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ కాంగ్రెస్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గాలు వేర్వేరుగా నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు భట్టి వర్గంలో 12 మందికి బీ ఫామ్స్ దక్కగా, మంత్రి పొంగులేటి వర్గంలో ఐదుగురికి, ఎంపీ రేణుకాచౌదరి వర్గంలో ఒకరికి బీఫామ్ ఇచ్చారు. ఒక వార్డులో సీపీఐ అభ్యర్థికి, మరొక వార్డులో సీపీఎం అభ్యర్థికి మద్దతిస్తూ కాంగ్రెస్ తరపున నామినేషన్లు వేయలేదు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 540 మంది బరిలో నిలిచారు. వీరికి ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్?లో 60 డివిజన్లకు 354 మంది పోటీలో ఉన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో 22 వార్డులకు 78 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.



# మరణించిన జర్నలిస్ట్ కుటుంబాలకు లక్ష సాయం

**ప్రముఖ జర్నలిస్టుల జీవితాలపై పుస్తకాల ప్రచురణ**

**మీడియా అకడామీ కృషిని అభినందించిన మండలి ఛైర్మన్ గుత్తా**



**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మేమున్నాం అనే భరోసా ఇచ్చి వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమం అభినందనీయం అని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. బుధవారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ మరియు అకాడమి ప్రచురించిన చిరుపుస్తకాలు ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావుతో కలిసి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి ఛైర్మన్ మాట్లాడుతూ, అక్షరమే ఆయుధంగా క్షేత్రస్థాయిలో పని చేసే జర్నలిస్టులు అకాల మృతి చెందడం బాధాకరమన్నారు. మరణించిన జర్నలిస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు మంజూరు చేయడంతోపాటు అయిదు సంవత్సరాల పాటు పెన్షన్ సదుపాయం కల్పించడం మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు తోడ్పడుతుందని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా పాత్రికేయ రంగంలో అనేక సంవత్సరాలు సేవలందించిన ప్రముఖ జర్నలిస్టు జీవిత విశేషాలు తెలిపే చిరు పుస్తకాలు ఆవిష్కరించడం వలన రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. నేటి సమాజంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో ఎన్ని మార్పులు వచ్చినా తను నేను మాత్రం పత్రికలు చదివితినే సంతృప్తి చేందుతానని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. విద్యా, ప్రజా వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు కె. కేశవ రావు మాట్లాడుతూ, ప్రముఖుల చరిత్ర తెలిపే పుస్తకం చదవడం సులభం. కాని అదే చరిత్ర ను మోనోగ్రాఫ్ గా అందించడం మాటలు కాదు. అది అక్షర రూపం దాల్చడంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమాజానికి అద్దం పట్టేది వార్త అయితే ఆ వార్త వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసిన జర్నలిస్ట్ భవిష్యత్తు తరాలకు దారి చూపిన వారవుతారు. సోషల్ మీడియా ను కంట్రోల్ చేయడం ఎవరి తరం కాదన్నారు. కానీ దీనిపై మన జర్నలిస్టులందరూ ఎకతాటిపై వచ్చి చర్చించడం లేదా వర్క్ షాప్ లు నిర్వహించి కొంత మార్పుకు నాంది పలకాలన్నారు. తెలంగాణ మీడియా అకాడమి ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, చనిపోయిన 18 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ, ప్రమాదానికి గురైన జర్నలిస్టుకు 50 వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేసినట్లు ఆయన వివరించారు. ప్రముఖ పాత్రికేయులైన అబిద్ అలీఖాన్, డి. సీతారాం, బేతనబొట్ల నాగేశ్వరరావు, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎం.ఎస్.ఆచార్య,.ఎ.బి.కె. ప్రసాద్, జి.ఎస్. వరదాచారి, సి.రాఘవాచారి, వి.హనుమంతరావు, ఆదిరాజు వెంకటేశ్వరరావులపై మీడియా అకాడమి ప్రచురించిన 10 చిరుపుస్తకాలు (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు,సీనియర్ జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో బిసి విద్యార్థుల జాబితా

**తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ సమీక్ష**

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** రాష్ట్రంలో వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని కులాల వారిగా సేకరించే విషయంలో బీసీ కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా ఇ. నవీన్ నికోలస్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రొ శ్రీరామ్ వెంకటేష్, రిజిస్ట్రార్, కాళోజి నారాయణరావు యూనివర్సిటి ఆఫ్ హెల్త్ సైన్సెస్ డా కె. నాగార్జున రెడ్డి, సెక్రెటరి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ శ్రీ కష్ణ ఆదిత్యలతో బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి మరియు మెంబర్ సెక్రెటరి బాల మాయా దేవి, ఐఏఎస్., గారు సవివరంగా చర్చించడం జరిగింది. సమావేశంలో డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మీనారాయణ మరియు తదితర అధికారులు కూడా పాల్గొన్నారు. బీసీ కమిషన్ ఛైర్మన్ మరియు అధికారులు రాష్ట్రంలో విద్యార్థుల డేటా సేకరించడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నందున దీని ప్రాధాన్యతను గుర్తించి, సమాచారం సేకరించి, కమిషన్కు అందించాలని కోరడం జరిగింది. సమాచారం ఆధారంగా బీసీ విద్యార్థుల్లో ఏ కులానికి, ఏ వర్గానికి చెందినవారు విద్యకు దూరంగా ఉంటున్నారో గుర్తించి, వారిని ప్రోత్సహించే అవకాశం కలుగుతుందని వివరించి చెప్పడం జరిగింది. సమావేశానికి హాజరైన అధికారులందరు వెంటనే ఈ సమాచారాన్ని సేకరించి కార్యక్రమానికి స్వీకారం చుడతారని, ఈ సంవత్సరం మార్చి లోపల వివరాలు అందిస్తామని చెప్పడం జరిగింది. సెక్రెటరి, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండే అడ్మిషన్స్లోనూ రాబోయే విద్యా సంవత్సరం నుండి జరిగే ప్రవేశ పరిక్షలోను కుల సంబంధిత సమాచారాన్ని కూడా సేకరించబోతున్నామని స్పష్టం చేయడం జరిగింది.

# ఎసిబి వలలో ప్రభుత్వోద్యోగి

**పదివేలు తీసుకుంటుండగా పట్టివేత**

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** ఏసీబీ వలలో మరో ప్రభుత్వ ఉద్యోగి చిక్కారు. నగరంలోని బండ్లగూడ డిప్యూటీ విద్యాశాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న శివప్రసాద్ బుధవారం ఓ స్కూల్ యాజమాన్యం నుంచి రూ. 10 వేలు తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్గా చిక్కారు. పదవతరగతి పరీక్ష కేంద్రం నుంచి తమ పాఠశాలను తొలగించవద్దని బాధితుడు కోరగా అందుకు శాఖాధికారులు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ను నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వివరించారు.

# బిజెపి అభ్యర్థులకు బూస్ట్

**ప్రచారం చేయనున్న పవన్ కళ్యాణ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్రావు.. పవన్ కళ్యాణ్ను కలిశారు. హైదరాబాద్లోని ఆయన నివాసంలో మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్ను కోరారు. ఇందుకు పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కళ్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కళ్యాణ్ గారు భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

# పులి జాడలతో జనం బెంబేలు

**అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**

**జనగామ, ఫిబ్రవరి 4 :** పెద్దపులి సంచారం ఇప్పుడు మూడు జిల్లాల వాసులను భయాందోళనకు గురి చేస్తోంది. సిద్దిపేట, యాదాద్రి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో తిరుగుతున్నట్లుగా గుర్తించారు. జనగామ మండలంలోని సిద్దెంకి, పెంబర్తి, పెద్దరాంచర్లలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యాద్రాది భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ మీదుగా పెద్దపులి జనగామకు ప్రవేశించినట్లు రైతులు ఆటవీశాఖ, పోలీసులు సమాచారం అందించారు. దీంతో ఆధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి పులి పాదముద్రలను సేకరించారు. వ్యవసాయ బావుల ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండోచ్చని కావున వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జగదేవ్పూర్ మండలం దౌలాపూర్ అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి వరుస గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా ఈ పులి యాదాద్రి భువనగిరి(జజీటజీటసతి ఃఠబీలజీనిజీణతిసతి) జిల్లా రాజపేట మండలం బసంతపూర్ సమీపంలో ఓ లేగదూడపై దాడి చేసి చంపేసినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, తాజాగా జనగామ జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామ పరిసరాల వైపు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. ఘటనా స్థలాల్లో అటవీ శాఖ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. పులి ప్రయాణించే మార్గాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి సంచారం కారణంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# కాంగ్రెస్కు ఓటేసి కష్టాలు తెచ్చుకున్నాం

**మళ్లీ ఆ పొరపాటు చేయకుండా ఉందాం**

**మెదక్ మున్సిపల్ ప్రచారంలో పద్మాదేవేందర్**

**మెదక్,ఫిబ్రవరి 4 :** గత ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేసి కష్టాలు తెచ్చుకున్నామని, మున్సిపల్ ఎన్నికల్లో ఆ తప్పిదం చేయకుండా బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మెదక్ మున్సిపల్ పరిధిలోని 1,2,3,4 వార్డులో అభ్యర్థులు చెప్యాల. రాజవ్వ సంజీవ్,ఎరుకల. ఎల్లయ్య, కొట్టాల.లలితమ్మ విశ్వం, ధర్మశెట్టి. స్వరూపలతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎరువులు సకాలంలో అందజేస్తూ ఇబ్బందులు లేకుండా చూసారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కోసం రైతులు క్యూ కడుతున్నారని చెప్పారు. మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి నీరు సరఫరా చేసి మహిళల ఇబ్బందులను తీర్చాలని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో నీటి సమస్య తీవ్రంగా ఉన్న పట్టించుకునేవారు లేకుండా పోయారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను నేడు ప్రజలు గుర్తు చేసుకుంటూ బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేస్తామని అంటున్నారని వెల్లడించారు. ఏ ఇంటికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు రూ.2 వేల పింఛన్లు రూ.4 వేలు చేస్తానని ఇవ్వలేదని, ఇండ్లు ఇస్తామని ఇవ్వలేదని, స్కూటీలు రాలేదని, తులం బంగారం ఇవ్వలేదని, మహిళలకు రూ.2,500 ఇస్తామని ఇవ్వలేదని,రూ.5 లక్షల విద్యా గ్యారెంటీ ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి రాలేదని ప్రజలు అంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి, ప్రజలను మోసం చేసి, మభ్యపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖచ్చితంగా ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని తెలిపారు.ఎమ్మెల్యే సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నామని, అనాథలను ఆదుకుంటున్నామని ప్రచారం చేశారని , అభివృద్ధి ఎక్కడ జరిగింది, ఎవరిని ఆదుకున్నారని ప్రశ్నించారు. కేసులు పెడతామని భయభ్రాంతులకు కూడా చేస్తే ఇక్కడ భయపడే వారు ఎవరు లేరని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కొట్టాల. విశ్వం,భీమారి. కిషోర్,వార్డ్ ఇంచార్జిలు హవేళిఘనాపూర్ సర్పంచ్ మ్యాకల. సాయిలు,ఉప్ప సర్పంచ్ వడ్ల రాజు,పట్టణ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 15లక్షలు తీసుకుంటూ ఎసిబికి చిక్కిన జోన్ ఎస్ఇ

**హైదరాబాద్,ఫిబ్రవరి4 :** ఏసీబీ అధికారుల వలలో భారీ అవినీతి తిమింగలం పడింది. రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ కూకట్పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి అధికారులకు చిక్కారు. జీహెచ్ఎంసీ కూకట్పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. చిన్నారెడ్డి ఆస్తులు, ఇతర అంశాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. బిల్లులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని ఒక కాంట్రాక్టర్ను డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు.

# అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు భారత్

### అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం




అండర్-19 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ వరుస విజయాలతో అదరగొడుతోంది. బుధవారం జరిగిన సెమీఫైనల్ పోరులో అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితమైన ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలోనే ఛేదించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115; 104 బంతుల్లో) సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (68; 33 బంతుల్లో) అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (62) బాధ్యతాయుతంగా ఆడి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. చివర్లో విహాన్ మల్హోత్రా (38 నాటౌట్) విన్నింగ్ షాట్ కొట్టి మ్యాచ్?ను పూర్తి చేశాడు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులతో భారీ స్కోర్? చేసింది. ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్లా (101 నాటౌట్) అద్భుత శతకాలతో భారత బౌలర్లను ఆడుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు భారీ స్కోరు అందించారు. ఉస్మాన్ సాదత్ (39), ఖలీద్ అహ్మద్జాయ్ (31) కూడా బాగానే ఆడారు. అఫ్గాన్ చివరి 10 ఓవర్లలో ఏకంగా 111 పరుగులు చేయడం గమనార్హం. భారత బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు తీశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్‌కు ఓపెనర్లు ఉస్మాన్ సదత్(39), ఖలిద్ అహ్మద్‌జాయ్(31) శుభారంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఈ జోడిని దీపేష్ దేవంద్రన్ విడదీసాడు. ఖలిద్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరో ఓపెనర్ ఉస్మాన్‌తో కలిసి ఫైసల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. హాఫ్ సెంచరీకి చేరువైన ఉస్మాన్‌ను కాన్షిక్ చౌహాన్ ఔట్ చేశాడు. దాంతో క్రీజులోకి ఉజైరుల్లా నియాజై రాగా.. ఇద్దరూ కలిసి భారత బౌలర్లను చెడుగుడు ఆడారు. ఈ క్రమంలో 55 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన ఫైసల్.. అనంతరం మరింత దూకుడుగా ఆడి మరో 31 బంతుల వ్యవధిలోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కాస్త నిదానంగా ఆడిన ఉజైరుల్లా నియాజై 63 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 148 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని దీపేష్ విడదీసాడు. అద్భుతమైన బంతితో సెంచరీ హీరో ఫైసల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అజిజుల్లా మియకిల్‌తో కలిసి నియాజై చెలరేగాడు. భారీ సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడి 85 బంతుల్లో శతకం సాధించాడు. హాఫ్ సెంచరీ నుంచి శతకం పూర్తి చేసుకోవడానికి అతనికి 22 బంతులే పట్టింది. ఈ విధ్వంసంతోనే అఫ్గాన్ 310 పరుగుల భారీ స్కోర్ చేసింది. దీపేష్, కాన్షిక్ చౌహాన్ మినహా భారత బౌలర్లంతా విఫలమయ్యారు. పరుగులను కట్టడి చేయకపోగా.. వికెట్లు కూడా తీయలేకపోయారు. భారత్ ఫైనల్ చేరాలంటే 310 పరుగుల ఈ లక్ష్యాన్ని ఛేదించాలి. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న ఈ వికెట్‌పై భారత టాపార్డర్ చెలరేగితే ఇది సాధ్యమవుతుంది.



అండర్-19 ప్రపంచకప్ చరిత్రలో 311 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడం ఇదే అత్యధికం. ఇప్పటివరకు జరిగిన 16 మెగా టోర్నీల్లో భారత్ ఫైనల్‌కు చేరడం ఇది 10వ సారి కావడం విశేషం. ఇప్పటికే ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్, ఇప్పుడు ఆరో ట్రోఫీపై కన్నేసింది. ఫిబ్రవరి 6న జరగనున్న ఈ ప్రపంచ కప్? తుది పోరులో భారత్, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి.

# వయసు కేవలం సంఖ్య మాత్రమే

### ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలి



తదుపరి ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియా మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా? అనే ప్రశ్నకు దిగ్గజ సారథి మహేంద్ర సింగ్ ధోనీ ఆసక్తికర సమాధానం చెప్పాడు. ఫిట్‌నెస్, ఫామ్ ఉంటే వయసుతో సంబంధం లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగవచ్చని అభిప్రాయపడ్డాడు. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, 35 ఏళ్ల వ్యక్తి 22 ఏళ్ల కుర్రాడి కంటే ఫిట్‌గా ఉంటే అతనే జట్టుకు అర్హుడని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా ఫిట్‌గా ఉండి, ఫామ్‌లో ఉంటే వన్డే ప్రపంచకప్ 2027 ఆడుతారని బదులిచ్చాడు. వయసును కాకుండా ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు పరోక్షంగా చురకలంటించాడు. 'రోహిత్, కోహ్లీ వన్డే ప్రపంచకప్ 2027లో ఎందుకు ఆడకూడదు? నా దృష్టిలో వయసు కొలమానం కాదు. ప్రదర్శన, ఫిట్‌నెస్ మాత్రమే జట్టులో కొనసాగాలా? వద్దా? అనేదానికి ప్రమాణాలు. అందుకే ఎవరికీ ఎమి చెప్పాల్సిన అవసరం లేదని నేను భావిస్తాను. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉండాలి. జట్టులో అందరినీ ఒకేలా చూడాలి. నేను అరంగేట్రం చేసినప్పుడు నాకు 24 ఏళ్లు. ఆ సమయంలో ఎవరూ వచ్చి నాకు ఏం చెప్పలేదు. కాబట్టి ఇప్పుడు నేను భారత్ తరఫున ఏడాది ఆడినా... మరో పదేళ్లు, 20 ఏళ్లు ఆడినా.. నా వయసు గుర్తు చేయాల్సిన అవసరం లేదు. వయసు ఏమాత్రం కొలమానం కాదు. ఫిట్‌నెస్ అత్యంత ముఖ్యం. 22 ఏళ్ల కుర్రాడు కూడా ఫిట్‌గా లేకపోతే జట్టుకు అనవసరం. విరాట్ కోహ్లీ లేదా భవిష్యత్తులో వచ్చే ఇతర ఆటగాళ్ల గురించి మాట్లాడితే.. ఒకరికి 30 ఏళ్లు దాటాయి కాబట్టి వారు తదుపరి ప్రపంచకప్ ఆడగలరా? లేదా? అనే నిర్ణయించాల్సింది మనం కాదు. అది వారి వ్యక్తిగత నిర్ణయం. వారు ఫిట్‌గా ఉండి నిలకడగా రాణిస్తూ.. దేశంలో కోసం ఆడాలనే పట్టుదలతో ఉంటే.. వారిని ఎందుకు పక్కనపెట్టాలి. అనుభవం కలిగిన ఆటగాళ్లు ఎలా వస్తారు? సచిన్ టెండూల్కర్ మినహా ఎవరూ 20 ఏళ్ల వయసులోనే అనుభవం సంపాదించలేదు. సచిన్‌లా 16-17 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ ఆడినవారు చాలా తక్కువ. అంతర్జాతీయ క్రికెట్ చాలా భిన్నమైనది. ప్రస్తుతం అనుభవం కలిగిన ఆటగాళ్లు కావాలంటే 30-33 ఏళ్ల వయసున్న వారు కావాలి. కానీ మనం 20, 25 మ్యాచ్‌లు ఆడిన వారిని అనుభవం కలిగిన ఆటగాళు ‌గా చూస్తున్నాం. ఒత్తిడిలో ఆడితేనే నిజమైన అనుభవం వస్తుంది. కేవలం మ్యాచ్‌ల సంఖ్యతో కాదు. ముఖ్యంగా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేవారు, డెత్ ఓవర్లలో బౌలింగ్ చేసేవారికి అనుభవం చాలా ముఖ్యం. ఉత్కంఠగా సాగే మ్యాచ్‌లు ముగింపుకు వచ్చినప్పుడు వారి అనుభవం కీలక పాత్ర పోషిస్తుంది. ఒక బౌలర్‌గా నేను 10-20 సార్లు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవాలంటే, కనీసం నేను 80-85 మ్యాచ్‌లు ఆడాలి. అప్పుడే నా భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలో, ఒత్తిడిని ఎలా తట్టుకోవాలో అర్థమవుతుంది. అనుభవం, యువ ఆటగాళ్ల కలయికతో జట్టు ఉండటం చాలా ముఖ్యం. అయితే ఫిట్‌నెస్‌ను పణంగా పెట్టి జట్టును ఎంపిక చేయకూడదు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడాలంటే ఫిట్‌గా ఉండాలి. 35 ఏళ్లు వచ్చినా ఫిట్‌గా ఉంటే వయసుతో సంబంధం లేదు. 24 ఏళ్ల వారికైనా, 35 ఏళ్ల వారికైనా ఫిట్‌నెస్, ఫామ్ ముఖ్యం. కాబట్టి ఎవర్నీ ప్రశ్నించే అవకాశమే లేదు. అందర్నీ సమానంగా చూడండి. ఫామ్‌లో ఉండి మెరుగైన ప్రదర్శన చేస్తే జట్టులో ఉంటారు. లేకపోతే అవకాశం కోల్పోతారు. చాలా సార్లు తదుపరి ప్రపంచకప్‌కు 3-4 ఏళ్ల సమయం ఉంది కదా? అని అంటుంటారు. ఒకవేళ ఆ ఆటగాడు ఫిట్‌గా లేకపోతే.. ఎప్పుడైనా అతన్ని పక్కనపెట్టవచ్చు. మెరుగైన ప్రదర్శన చేయకపోయినా తొలగిస్తారు. కాబట్టి ఏ వ్యక్తి సెలెక్షన్ గురించి ప్రశ్నలు తలెత్తకూడదు. ఒకే ఒక్క సూత్రం.. బాగా ఆడుతున్నారు, ఫిట్‌గా ఉన్నారంటే ఆడుతూనే ఉండండి.'అని ధోనీ పేర్కొన్నాడు.

# వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఊచకోత



టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్మురేపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో సౌతాఫ్రికాతో ముంబై వేదికగా జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 20 బంతుల్లోనే 53 రన్స్ చేశాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన ఇషాన్ కిషన్ అదే జోరును కొనసాగించాడు. ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని వామప్ మ్యాచ్‌లో సత్తా చాటాడు. సహచర ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఒకే ఓవర్లో 29 పరుగులు చేశాడు. అన్రిచ్ నోకియా వేసిన ఐదో ఓవర్ తొలి బంతికి అభిషేక్ సిక్స్ కొట్టి రెండో బంతికి సింగిల్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ వరుసగా 6, 6, 4, 6 బాదాడు. 7 సిక్సులు, 2 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని రిటైర్డ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ టీమిండియా ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని ఈ మ్యాచ్ ద్వారా టీమ్ మేనేజ్‌మెంట్ హింట్ ఇచ్చింది.

# పాకిస్థాన్ నీచపు బుద్దే అంత!!

### టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ నీచపు బుద్దే ఈ వివాదానికి కారణమని తెలిపాడు. నాలుగు రోజుల్లో పాక్ దారికొస్తుందని అభిప్రాయపడ్డాడు. కచ్చితంగా భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందని, ఆ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. భద్రతా కారణాల నేపథ్యంలో భారత్‌లో పర్యటించలేమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. దాంతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోగా.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. అయితే ఈ నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తప్పుబట్టింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. తాజాగా ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. పాకిస్థాన్ తీరును తప్పుబట్టాడు. 'వందకు 100 శాతం భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరుగుతుంది. మరో నాలుగైదు రోజుల్లో పాకిస్థాన్ దారికొస్తుంది. భారత్, పాక్ మ్యాచ్ చూడాలని నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఒకవేళ భారత్‌తో మ్యాచ్ ఆడకుంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకే భారీ నష్టం వాటిల్లుతుంది. బ్రాడ్‌కాస్టర్లు పెద్ద మొత్తాల్లో నష్టపోతారు. మిగతా బోర్డులు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఐసీసీ మీటింగ్‌లో కూడా ఈ విషయం ప్రస్తావనకు వస్తుంది. పీఎస్ఎల్ కోసం విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసీలు రావు. మిగతా క్రికెట్ బోర్డులు కూడా పాకిస్థాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తాయి. ఇప్పటికే ఇరు దేశాల క్రికెట్ బోర్డుల ఒప్పందాల్లో భాగంగా తటస్థ వేదికల్లో తలపడుతున్నాయి. కాబట్టి ఓ ప్రత్యర్థితో నేను ఆడను అనడం ఆమోదయోగ్యం కాదు. పాకిస్థాన్‌కు పాకిస్థానే పెద్ద శత్రువు. దీనంతటికీ వారి నీచపు బుద్దే కారణం.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ టోర్నీ ఆదివారం ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఆదివారం అమెరికాతో జరిగే తొలి మ్యాచ్‌తో టీమిండియా తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది.

# ప్రపంచ వరల్డ్ కప్ 2027లో ఆడటం ఖాయం!

### పద్మశ్రీ అవార్డుపై రోహిత్ శర్మ భావోద్వేగం



ప్రపంచ క్రికెట్‌లో హిట్‌మ్యాన్‌గా పేరుగాంచిన భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ పద్మశ్రీ అందుకున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యాడు . ఆయన చేసిన ప్రకటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తన దేశం కోసం ట్రోఫీలు గెలవడానికి తాను ప్రయత్నిస్తూనే ఉంటానని రోహిత్ శర్మ చెబుతున్నాడు. రోహిత్ టెస్ట్, టీ20 ఫార్మాట్ నుంచి రిటైర్ అయ్యాడు, కానీ వన్డేలు ఆడుతూనే ఉన్నాడు. 2027 వన్డే ప్రపంచ కప్ వచ్చే ఏడాది జరగనుంది. అందులో ఆడతానని చెప్పకనే చెప్పాడు. ప్రపంచకప్ గెలవడం రోహిత్ కల. పద్మశ్రీ అవార్డును పొందడం ఒక ప్రత్యేక క్షణంగా అభివర్ణించిన రోహిత్ శర్మ, తన క్రికెట్ కెరీర్‌లో తనకు మద్దతు ఇచ్చిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. దూరదర్శన్ స్పోర్ట్స్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఃలో షేర్ చేసిన వీడియోలో, రోహిత్ శర్మ మాట్లాడుతూ, "పద్మశ్రీని అందుకోవడం నాకు , నా కుటుంబానికి చాలా ప్రత్యేకమైన క్షణం. ఈ గౌరవం కల్పించిన భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు. నా కెరీర్‌లో ముఖ్యమైన పాత్ర పోషించిన వారందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నా దేశం కోసం మ్యాచ్‌లు ఆడుతూనే ఉంటాను, ట్రోఫీలు గెలవడానికి నేను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తాను. ధన్యవాదాలు. జై హింద్." అని ఆ వీడియోలో ఉంది. రోహిత్ శర్మ ఏప్రిల్ 30, 1987న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జన్మించాడు. రోహిత్ శర్మ భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, అతని పవర్‌ఫుల్ షోర్ట్స్, సిక్సర్ల కారణంగా "హిట్‌మ్యాన్" అనే పేరును అభిమానులు పెట్టారు. రోహిత్ శర్మ జూన్ 23, 2007న ఐర్లాండ్‌తో జరిగిన వన్డే ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. అతను సెప్టెంబర్ 19, 2007న తన తొలి ం20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. 2013లో టెస్ట్ అరంగేట్రం చేశాడు. గత 18 సంవత్సరాలుగా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న రోహిత్ శర్మ ం20, టెస్ట్ ఫార్మాట్ల నుంచి రిటైర్ అయ్యాడు. 2024 టీ20 ప్రపంచ కప్ ఫైనల్లో భారత్ విజయం సాధించిన తర్వాత జూన్ 29న రోహిత్ శర్మ టీ20 ప్రపంచ కప్ నుంచి రిటైర్ అయ్యాడు. తన 159 మ్యాచ్‌ల టీ20 కెరీర్‌లో 4,231 పరుగులు చేశాడు. ఐదు సెంచరీలు, 32 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలతో 4,301 పరుగులు కూడా చేశాడు. మే 7, 2025న ఆయన టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యారు. రోహిత్ శర్మ నాలుగు ఐసిసి ట్రోఫీలను గెలుచుకున్నాడు. వాటిలో రెండు కెప్టెన్‌గా వచ్చాయి. అతను 2007 టి 20 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో భాగం. రోహిత్ 2013 ఛాంపియన్స్ ట్రోఫీని కూడా గెలుచుకున్నాడు. కెప్టెన్‌గా, అతను 2024 టి 20 ప్రపంచ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్నాడు. రోహిత్ శర్మ ఇప్పటికీ వన్డే క్రికెట్‌లో దూకుడుగా ఆడుతున్నాడు. తన 279 మ్యాచ్‌ల వన్డే కెరీర్‌లో, అతను 33 సెంచరీలు, 61 హాఫ్ సెంచరీలతో సహా 11,516 పరుగులు చేశాడు.

# అవతార్ లెవల్లో వారణాసి మూవీ

**పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదరింది**

**ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారు**

**అత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాం**

**అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు**

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న



ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పాని ప్రియాంక అన్నారు. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు విశేషాలు తెలిపారు. 15 ఏళ్ల కిత్రమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆర్ఆర్ఆర్' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టిందని మహేశ్ బాబు అన్నారు. 'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది. 'వారణాసి' లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను ఎంపిక చేయడం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ సినిమాలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత విభిన్నమైన, అంచనా వేయలేని పాత్ర అని ఆయన తెలిపారు. ఈ కుంభ క్యారెక్టర్ పూర్తిగా గ్రే షేడ్స్‌తో సాగుతుందని చెప్పారు. ఎప్పుడు ఏం చేస్తాడో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఈ పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు. తన నిజజీవితానికి పూర్తిగా భిన్నమైన డార్క్ రోల్ కావడం వల్ల ఇది తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వీల్‌చైర్, 'డాక్టర్ ఆక్టోపస్' తరహాలో రోబోటిక్ చేతులు వంటి ఎలిమెంట్స్‌తో పృథ్వీరాజ్ లుక్ భయానకంగా ఉండనుందని సమాచారం. కేవలం కళ్లతోనే భయపెట్టే విధంగా ఈ పాత్రను డిజైన్ చేశారనే ప్రచారం జరుగుతోంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు చూడని సైకలాజికల్ విలన్‌గా 'కుంభ' నిలుస్తాడని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి 'వారణాసి'లో హీరో మహేష్ బాబు పోషిస్తున్న 'రుద్ర' పాత్రకు సమానంగా నిలిచే 'కుంభ' విలన్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశముంది.



# బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది.ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బు÷-లలెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది.గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. 'ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది' అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర్' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.

# తక్షకుడిగా వస్తున్న ఆనంద్ దేవరకొండ



యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ 'తక్షకుడు'. గతంలో 'మిడిల్ క్లాస్ మెలోడీస్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని అందించిన దర్శకుడు వినోద్ అనంతోజు, ఆనంద్ దేవరకొండ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా టీజర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే ఇది పక్కా రివెంజ్ డ్రామాగా కనిపిస్తోంది. పెళ్లయిన రోజే తన కుటుంబాన్ని కోల్పోయి, తీవ్ర గాయాలతో అడవిలో పడి ఉన్న యువకుడిని స్థానికులు కాపాడటం, ఆ తర్వాత తన పతనానికి కారణమైన వారిపై అతను తీర్చుకునే ప్రతీకారమే ఈ చిత్ర కథాంశమని అర్థమవుతోంది. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా చాలా ఇంటెన్స్ మరియు సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. ఇక 'లాపతా లేడీస్' ఫేమ్ నితాన్షీ గోయల్ ఈ చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, కాలకేయ ప్రభాకర్ కీలకమైన నెగటివ్ రోల్‌లో నటిస్తున్నారు. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం నేరుగా నెట్‌ప్లిక్స్‌లో తెలుగుతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

# చిరుమూవీలో సారా అర్జున్ ?

మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.



EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com